క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు

సి.బెళగల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. బుధవారం గూడూరు, కోడుమూరు ఎస్ఐలు హనుమంతప్ప, బాలనరసింహులు, పోలీస్ సిబ్బందితో కలిసి సి.బెళగల్ మండలంలోని ముడుమాల గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని పాత నేరస్తులు, అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు చేశారు. గొడవలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే శిక్ష తప్పదని హెచ్చరించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా నడుచుకోవాలని సూచించారు. పల్లెల్లో ఎలాంటి అలజడులు, అల్లర్లు జరగకుంగా పోలీస్ సిబ్బందితో నిరంతర గస్తీని నిర్వహిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. అల్లర్లు, అనుమానితులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులను కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత



లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్న డీటీ

కోడుమూరు రూరల్: మండలంలో పేదలందరికీ ఇళ్లు పథకంలో స్థలాలు పొందిన 687 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసినట్లు కోడుమూరు డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయా గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న లబ్ధిదారులకు మంజూరైన రిజిస్టర్ పత్రాలను డీటీ పరిశీలించి అందజేశారు. 13 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 2045 మంది లబ్ధిదారులు ఉండగా, ఇప్పటి వరకు 1545 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. ఇందులో 687 మందికి పత్రాలు మంజూరయ్యాయని.. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్, పత్రాల పంపిణీని త్వరలో పూర్తి చేస్తామని డీటీ చెప్పారు.

నేడు వేలం పాట

గూడూరు: వారపు సంత, గొర్రెలు, పెద్ద పశువుల మాంసం మార్కెట్, కమేళ నిర్వహణకు గురువారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకరరెడ్డి తెలిపారు. మంగళవారం దినసరి కూరగాయల మార్కెట్‌కు బహిరంగా వేలం పాట నిర్వహించగా మిగిలిన వాటిని వాయిదా వేసినట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

చురుగ్గా ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

సి.బెళగల్: మండలానికి మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. బుధవారం సి.బెళగల్, కంబదహాల్ గ్రామాల్లో కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 16 గ్రామ సచివాలయాలకు 14,937 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బయోమెట్రిక్ తీసుకుని లబ్ధిదారులకు కార్డులు అందజేయాలని సూచించారు.

నేడు వలంటీర్లకు వందనం

కల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ

పాణ్యం: ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని.. రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ అశోక్ అన్నారు. బుధవారం పాణ్యంలో వాహనాల తనిఖీ చేశారు. ఓర్వకల్లు నుంచి పాణ్యం మండలంలోని పలు గ్రామాలకు పరిమితికి మించి ప్రయాణికులతో వెళుతున్న ఆటోలను స్టేషన్‌కు తరలించారు.

ఉప్పలపాడు.. అభివృద్ధి చూడు

- రూ.కోటితో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఆఘమేఘాలపై పైపులైన్ నిర్మాణ పనులు
- శరవేగంగా సీసీరోడ్ల నిర్మాణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



గ్రామ శివారులో వేసిన కొత్త బోరు.



బోరు నుంచి గ్రామంలోకి ఏర్పాటు చేస్తున్న పైపులైన్



ఓర్వకల్లు: గ్రామీణ ప్రజలకు సకల సదుపాయాలను కల్పించి, సమస్యల నుంచి గట్టెంకించాలని వైఎస్సార్‌సీపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రజా సమస్యలపై దృష్టి సారించి మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

గ్రామంలో సుమారు 2 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వాటికి రోజుకు సగటున లక్ష లీటర్ల నీరు అవసరమవుతుందని అధికారుల అంచనా. గ్రామంలోని మంచినీటి బోర్లు ఎండిపోవడంతో పదేళ్ల నుంచి ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇక్కట్లకు గురయ్యేవారు. సమస్యను గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మరింత జటిలంగా మారింది. గ్రామస్తులు గుక్కెడు నీటికోసం వ్యవసాయ బోరు బావులను ఆశ్రయించాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. అంతేగాక సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులతో అభివృద్ధి పరుగులు పెడుతోంది.

ఎమ్మెల్యే కాటసాని చొరవతో నిధులు మంజూరు

స్థానిక సర్పంచ్ ఆవుల అయ్యస్వామి ప్రజల ఇబ్బందులు, గ్రామ అభివృద్ధి దృష్ట్యా ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వెంటనే గ్రామ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. తక్షణమే స్పందించిన ఆయన ఏకకాలంలో రూ.కోటికిపైగా నిధులు మంజూరు చేయించారు. దీంతో వెంటనే అధికారులతో ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పనులకు నాందిపలికారు. నిధులలో సుమారు రూ.6 లక్షలతో గ్రామానికి రెండు కి.మీల దూరంలో 850 అడుగుల్లో మూడు బోర్లు, మరో వెయ్యి అడుగులలో ఒక బోరు చొప్పున ఒకేసారి నాలుగు బోర్లు వేయించడం జరిగింది. అన్ని బోర్లలో నీళ్లు పుష్కలంగా పడడంతో వెంటనే పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభించడంతో శాశ్వతంగా తాగునీటి కష్టాలు తొలగాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.70 లక్షలతో ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన..

గ్రామ ప్రజల అవసరాలను బట్టి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించేందుకు జలజీవన్ మిషన్ కింద మరో రూ.70 లక్షలు కేటాయించారు. ట్యాంక్ నిర్మాణ పనులకు త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. అలాగే పంచాయతీరాజ్ నిధులు రూ.15 లక్షలు, ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షలతో గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలలో పలు చోట్ల సీసీ రోడ్లు నిర్మించారు. అంతేగాక స్థానిక ఎస్సీ కాలనీలో టీడీపీ హయాంలో చేపట్టిన కమ్యూనిటీ భవనం నిర్మాణ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో మండల పరిషత్ నిధుల కింద రూ.5 లక్షలతో ఆ భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు.

రూ.35 లక్షలతో సచివాలయ భవనం

ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సచివాలయ వ్యవస్థలో భాగంగా గ్రామంలో రూ.35 లక్షలతో నూతనంగా గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మించారు. అలాగే రైతుల సౌలభ్యం కోసం మరో రూ.21.08 కోట్లతో రైతు భరోసా కేంద్ర భవనం నిర్మిస్తున్నారు. దీంతో ప్రజలతో పాటు, రైతులకు వ్యయ ప్రయాసాలు తగ్గాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామం నుంచి బుగ్గరామేశ్వరుని ఆలయం వరకు నిర్మించిన సీసీ రోడ్డు

సీసీ రోడ్ల నిర్మాణం సంతోషకరం



గ్రామంలో పలు చోట్ల సీసీ రోడ్లు వేయడం సంతోషంగా ఉంది. గత ప్రభుత్వంలో టీడీపీ నేతలు సీసీ రోడ్ల నిర్మాణాలను పట్టించుకోలేదు. దీంతో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చేది. ప్రస్తుతం గ్రామం నుంచి ఊరు శివారులోని బుగ్గరామేశ్వర స్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు వేయడంతో ప్రజలకు, భక్తులకు ఇబ్బందులు తొలగాయి. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం. – ఈ. ప్రభాకర్‌గౌడు, ఉప్పలపాడు

నీటి కష్టాలు తొలగినట్లే



కొత్త బోర్లు వేయించడం వల్ల ప్రజలకు తాగునీటి కష్టాలు తొలగినట్లే. పదేళ్ల నుంచి నీటి సమస్యతో చాలా ఇబ్బందులు పడ్డాం. గ్రామ సర్పంచు విన్నపం మేరకు స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే నాలుగు బోర్లు వేయించి, పైపులైన్ ఏర్పాటు చేయడంతో ప్రజల కష్టాలకు పరిష్కారం లభించింది. గత టీడీపీ ప్రభుత్వం నీటి సమస్యను పట్టించుకోలేదు. – గొల్ల వెంకటేశ్వర్లు

గ్రామ అభివృద్ధే ధ్యేయం



నేను మొదటి నుంచి జగన్ అభిమానినే. అయినా మాజీ ఎమ్మెల్యే గారు చరితపై ఉన్న అభిమానంతో గత ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇవ్వాల్సి వచ్చింది. అయితే గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే కాటసాని పిలుపు మేరకు ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరాను. ఎమ్మెల్యే కాటసాని అడిగిన ప్రతి సమస్యకు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి నిధులు కేటాయిస్తున్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు. – ఆవుల అయ్యస్వామి, సర్పంచు, ఉప్పలపాడు

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కుడా చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాడు–నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు మించి ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొండాపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి భోజనం నాణ్యతపై విద్యార్థులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం కింద ఎంతో రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని పెడుతోందని తెలిపారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయని, ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదివేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

నామినేషన్ కేంద్రం మార్పుపై అభ్యంతరం



రాజకీయ పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఆర్డీఓ

గూడూరు: గూడూరులోని రెవెన్యూ కార్యాలయంలో సరైన వసతులు లేవనే కారణంతో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని కర్నూలు ఆర్డీఓ కార్యాలయానికి మార్పు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని రాజకీయ పార్టీల నాయకులు ఆర్డీఓకు విజ్ఞప్తి చేశారు. బుధవారం పొలిటికల్ నాయకులతో సమావేశం నిర్వహించారు. కోడుమూరు అసెంబ్లీ ఈఆర్ఓ, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, తహసీల్దార్ ఉదయ్‌సంతోష్ హాజరయ్యారు. వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ.. కోడుమూరు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి నియోజకవర్గ హెడ్ క్వార్టర్‌గా గూడూరును ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. అప్పటి నుంచి గూడూరులోనే అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ జరిగేదన్నారు. అయితే అధికారులు ప్రస్తుత ఎన్నికల ప్రక్రియను కర్నూలులో నిర్వహించాలని ప్రతిపాదనలు తయారు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పందించిన ఆర్డీఓ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నుంచిమున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, టీడీపీ నుంచి ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గజేంద్రగోపాల్, బీజేపీ నుంచి మల్లేష్ నాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 32వ వార్డు సుందరయ్య నగర్‌లో అగ్నిప్రమాదం జరిగి రెండు కొట్టాలు కాలిపోయాయి. ఇంట్లో వస్తువులు, నిత్యావసర సరుకులు దగ్ధమయ్యాయి. ఎమ్మెల్యే కాటసాని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్ శ్రీనివాసులు బాధితులకు రెండు బియ్యం ప్యాకెట్లు అందజేశారు.

కాటాలకు ముద్రలు తప్పనిసరి



కూరగాయలను తూకం వేసి పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని సీక్యాంప్ రైతు బజారులో వినియోగిస్తున్న తూనిక రాళ్లకు ప్రభుత్వ ముద్రలు తప్పనిసరిగా వేయించుకోవాలని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌కుమార్ అన్నారు. బుధవారం రైతు బజారులో అధికారులు తనిఖీలు చేశారు. తూనిక రాళ్లకు ముద్రలు ఉన్నాయా.. తుకాల్లో తేడాలేమైనా ఉన్నాయా అని పరిశీలించారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సైన్స్‌పై పట్టుసాధిస్తే బంగారు భవిష్యత్తు



కోడుమూరు: సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గడివేముల: ఆకట్టుకుంటున్న ప్రదర్శనలు



ఓర్వకల్లు: మాట్లాడుతున్న హెచ్ఎం రామచంద్రారెడ్డి

కోడుమూరు రూరల్: సైన్స్‌తో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, సైన్స్‌పై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని అమడగుంట్ల హైస్కూల్ హెచ్ఎం అనంతయ్య అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రదర్శనలను ఆవిష్కరించారు. సీవీ రామన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని రాణించాలని ఆకాంక్షించారు.

శాంతిరాం ఫార్మసీ కళాశాలలో..

పాణ్యం: స్థానిక శాంతిరాం ఫార్మసీ కళాశాల ఫార్మసీ విద్యార్థులు సైన్స్ చార్ట్స్, మోడల్స్‌ను ప్రదర్శించారు. ప్రముఖ సైకాలజిస్ట్ విజయలక్ష్మి మానవాళికి సైన్సు ఎలా ఉపయోగపడుతుందనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదనశెట్టి సైన్స్ పరిశోధనల గురించి వివరించారు. విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు.

ప్రోత్సహిస్తే భావితరాల శాస్త్రవేత్తలు

గూడూరు: విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను ప్రోత్సహిస్తే భావితరాల శాస్త్రవేత్తలుగా తయారవుతారని హెచ్ఎం సాయిలీల అన్నారు. బుధవారం గూడూరు మండలం పెంచికలపాడు ఉన్నత పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. విద్యార్థులు పలు సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులను హెచ్ఎం అభినందించారు. జన విజ్ఞాన వేదిక సభ్యులు శేషాద్రిరెడ్డి, ప్రతాపరెడ్డి, రామకృష్ణారెడ్డి, అల్లిబాషా, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

అబ్బురపరిచిన ఆవిష్కరణలు

గడివేముల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అబ్బురపరిచే ఆవిష్కరణలతో ఆకట్టుకున్నారు. చిట్టి బుర్రలు పెద్ద ఆలోచనలతో ఆకట్టుకునే విధంగా స్టాళ్లను ప్రదర్శించారు. ముఖ్యంగా. గడిగరేవుల జెడ్పీ హైస్కూల్‌లో జీర్ణ వ్యవస్థపై ఏర్పాటు చేసి ఎగ్జిబిట్ ఆకట్టుకుంది. గడివేములలోని శ్రీరాజరాజేశ్వరి పాఠశాలలో 50 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఘనంగా సైన్సు దినోత్సవం

ఓర్వకల్లు: విద్యార్థులు సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకుని శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి, సమాజానికి ఉపయోగపడాలని హెచ్ఎం రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. ఓర్వకల్లు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1928 ఫిబ్రవరి 28వ తేదీ రామన్ ఎఫెక్ట్‌ను ఆమోదించిన సందర్భంగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి సైన్సుపై మక్కువ పెంచుకోవాలని, కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఆసక్తి పెంచుకోవాలన్నారు. కొందరు విద్యార్థులు సైన్సుపై పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు భాస్కర్, శారద, వరలక్ష్మి, వనజాక్షి, సుజాత పాల్గొన్నారు.

ఆక్రమిత భూమి పేదలకు పంపిణీ చేయాలి

ఓర్వకల్లు: ఆక్రమిత భూమిని పేదలకు పంపిణీ చేయాలని పాలకొలను వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, నాగార్జున, రామదాసు మహబూబ్‌బాషా బుధవారం డిప్యూటీ తహసీల్దార్ షర్మిలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 151లో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఐదు ఎకరాలను ఆక్రమించి పంట సాగుచేస్తున్నాడని తెలిపారు. గతంలో సదరు భూమిని పేదల ఇళ్ల పట్టాల కోసమని కేటాయించినట్లు తెలిపారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే పేదలకు న్యాయం చేయాలని చూస్తుంటే, ఆక్రమణదారులు ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. అనవసరంగా ఎమ్మెల్యేపై బురద జల్లాలని చూస్తే ఊరుకునే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. ఇప్పటికైనా అధికారులు కల్పించుకుని పేదలకు న్యాయం చేయాలని కోరారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

గూడూరు: గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి అన్నారు. బుధవారం పట్టణంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న గృహాలను ఆయన పరిశీలించారు. పట్టణంలో 186 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావ్ పీడీకి తెలిపారు. త్వరగా నిర్మించుకుంటే బిల్లులు వెంటనే మంజూరు చేస్తామన్నారు. స్టీల్, ఇసుక కూడా ఇస్తామని చెప్పారు.

బుగ్గరామేశ్వరస్వామి ఆలయ ఉత్సవ కమిటీ ఎంపిక



ఉత్సవ కమిటీ చైర్మన్ రామకృష్ణ

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన శ్రీబుగ్గరామేశ్వరస్వామి దేవాలయ ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు కమిటీని నియమించినట్లు చెప్పారు. చైర్మన్‌గా బోయ ఉప్పలపాటి రామకృష్ణను ఎంపిక చేశారు. సభ్యులుగా ఎం.నాగరాజు, ఎస్.మహేశ్వరప్ప, ఏ.రాజేష్, జి.లక్ష్మీదేవి, సి.లక్ష్మీదేవి, ఎం.మద్దమ్మ, బి.బాలమ్మ, నెనావత్ కల్యాణిబాయిని నియమించినట్లు వెల్లడించారు.

ఇన్‌చార్జ్ డీసీపీగా సంధ్య

కర్నూలు (టౌన్): నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ సిటీ ప్లానర్‌గా సంధ్యను నియమించారు. కుడాలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న ఆమెకు అదనంగా ఈ బాధ్యతలు అప్పగించారు. నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం డిప్యూటీ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న మోహన్‌కుమార్ దీర్ఘకాలిక సెలవు పెట్టారు. దీంతో అమెను నియమిస్తూ టౌన్ ప్లానింగ్ సంచాలకులు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.